సదస్సులో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు

27, 28న గవర్నర్ కార్యాలయం ఎదుట ధర్నా

రైతు, కార్మిక, ప్రజా సంఘాల నేతలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రైతులు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 27, 28 తేదీల్లో గవర్నర్ కార్యాలయం ఎదుట చేపడుతున్న ధర్నాను జయప్రదం చేయాలని రైతు, కార్మిక, ప్రజా సంఘాల నేతలు పిలుపునిచ్చారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సన్నాహక సదస్సులో నాయకులు మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు సమగ్ర ఉత్పత్తి వయానికి అదనంగా 50 శాతం కలిపి చట్టబద్ద మద్ధతు దరలు ప్రకటించాలని, కౌలు రైతులతో సహా రైతులందరికీ స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలు అందించాలని డిమాండ్ చేశారు. అలాగే కేరళ రాష్ట్ర తరహాలో రైతు రుణ ఉపశమన చట్టం పార్లమెంట్‌లో చేయాలని, లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని కోరుతూ విజయవాడలోని గవర్నర్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న ధర్నా చేయనున్నట్లు తెలిపారు. ఈ ధర్నాలో రైతులు, కార్మికులు, ప్రజాసంఘాల నాయకులు పెద్దఎత్తున పాల్గొని విజయవంత చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు, ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు, జిల్లా ప్రధాన కార్యదర్శి యు.రాజారెడ్డి, రైతు కూలీసంఘం రాష్ట్ర అధ్యక్షులు ఇండ్ల ప్రభాకర్ రెడ్డి, ఎఐఎఫ్‌టియు రాష్ట్ర అధ్యక్షులు సి.పెద్దన్న, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు సి.రామచంద్రయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, రైతు, కార్మిక సంఘం నాయకులు మల్లికార్జున, తరిమెల నాగరాజు, వెంకటనారాయణ, చెన్నప్ప యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కూల్చివేసిన చోటే పేదలకు ఇళ్లు నిర్మించాలి

అఖిలపక్ష పార్టీల నాయకుల డిమాండ్

సమస్యను కలెక్టర్‌కు వివరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

గార్లదిన్నె మండలం కల్లూరు గ్రామంలో పేదల గుడిసెలు కూల్చివేసిన స్థలంలోనే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని అఖిలపక్ష పార్టీల నాయకులుకలెక్టర్ ఎం.గౌతమికి విజ్ఞప్తి చేశారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఎం.గౌతమిని సిపిఎం, సిపిఐ, సిపిఐ ఎంఎల్, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, తెలుగుదేశం పార్టీల నాయకులు, దళిత, గిరిజన సంఘాల నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్, సిపిఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్, సిపిఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి సి.పెద్దన్న, సిపిఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు నాగరాజు, తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి నారాయణస్వామి యాదవ్, ఎస్సీ, ఎస్టీ సంఘాల జెఎసి ఛైర్మన్ సాకే హరి, చిన్న ఆంజనేయులు, రామాంజనేయులు, పుల్లన్న, రైతు సంఘం నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, పోతులయ్య, సిపిఐ నాయకులు గోపాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేదలైన దళిత గిరిజనులు వేసుకున్న గుడిసెలను ఖాళీ చేయించి ఆ స్థలాన్ని కబ్జా చేసేందుకు స్థానిక వైసీపీ నాయకులు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. కల్లూరు గ్రామంలో సుమారు 72 ఎకరాలు దేవుని మాన్యం భూములను కబ్జాదారులు ఆక్రమించుకుని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. నివాసాలు కోల్పోయి నిరాశ్రయులైన పేదలకు తక్షణం సహాయ చర్యలు చేపట్టాలని కోరారు. కలెక్టర్ స్పందిస్తూ ఇప్పటికే బాధితుల జాబితా తెప్పించుకున్నామని వారందరికీ పునరావాసం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఆ కాలనీలో ఉన్న పేదల్లో ఇప్పటికీ సర్కస్ లాంటి ఆటలపై ఆధారపడి జీవనం చేస్తున్న పసిపిల్లలు ఉన్నట్టుగా తనకు తెలిసిందని, వారిని హాస్టళ్లలో చేర్పించేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. రేషన్ కార్డు లేని వారికి మంజూరు చేస్తామన్నారు. తక్షణ సహాయం కింద చర్యలు చేపట్టాలని స్థానిక రెవెన్యూ అధికారులకు ఆదేశాలిచ్చామన్నారు. అదే స్థలంలో ఇళ్లు నిర్మించడం చాలా ఆలస్యం అవుతుందని వీలైనంత త్వరగా నివాసాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. ప్రత్యామ్నాయ స్థలం కాకుండా అక్కడే ఇళ్ల నిర్మాణం చేసి పేదలను ఆదుకోవాలని, సిఐ నరేందర్ రెడ్డి పై చర్యలు తీసుకోవాలని నాయకులు ఈసందర్భంగా కోరారు.

దేవాదాయ ఏసీపై చర్యలకు డిమాండ్ : గార్లదిన్నె మండలం, కల్లూరు అగ్రహారం గ్రామంలో దేవాదాయ శాఖ భూములను అధికార పార్టీ నేతలు వందల ఎకరాలు కబ్జా చేసి ప్లాట్లు వేసి విక్రయిస్తున్న పట్టించుకోకుండా, పేదలు వేసుకున్న గుడిసెలను మాత్రం పోలీసులు, రెవెన్యూ శాఖ అధికారులతో కలిసి తొలగింపజేసిన దేవాదాయ శాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఆదిశేషునాయుడుపై చర్యలు తీసుకోవాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం సిపిఎం ఆధ్వర్యంలో రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణకు వాట్సప్ ద్వారా వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ మాట్లాడుతూ గార్లదిన్నె మండలం కల్లూరు అగ్రహారం గ్రామంలో నవంబర్ 1న పేదల గుడిసెలను తొలగించి, ఆ భూములు, దేవాలయ భూములను రియల్‌ఎస్టేట్ కబ్జాదారులు ఆక్రమించుకోవడానికి సహకరిస్తున్న అనంతపురం జిల్లా దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ కె. ఆదిశేషనాయుడుపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

దేవాదాయ శాఖ కార్యాలయం దిగ్బంధం : నాలుగు రోజుల క్రితం కల్లూరు గ్రామంలో పేదలు వేసుకున్న గుడిసెలను దుర్మార్గంగా దేవాదాయ శాఖ అధికారులు పోలీసుల సహకారంతో కూల్చి వేసి, నిరాశ్రయులను చేయడాన్ని నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో దేవాదాయ శాఖ కార్యాలయాన్ని శనివారం ముట్టడించారు. హెచ్‌ఎల్‌సి కెనాల్ సమీపంలో ఉన్న దేవాదాయ శాఖ కార్యాలయాన్ని సిపిఎం నాయకులు ముట్టడించారు. అసిస్టెంట్ కమిషనర్ ఆదిశేషనాయుడు లేకపోవడంతో కార్యాలయంలోనే మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శులు వి.రామిరెడ్డి, ఆర్‌వి.నాయుడు మాట్లాడుతూ పేదలకు ఒక న్యాయం, పెద్దలకు భూకబ్జా దారులకు ఒక మరొక న్యాయం చేయడం దుర్మార్గం ఉందన్నారు. పేదలకు న్యాయం చేయకపోతే తీవ్ర పోరాటం చేస్తామని హెచ్చరించారు. అక్కడే ఉన్న పోలీస్ అధికారులు, కార్యాలయ సిబ్బంది అసిస్టెంట్ కమిషనర్ ఆదిశేషనాయుడుకు ఫోన్ చేసి నాయకులతో మాట్లాడించారు. 8వ తేదీన మాట్లాడి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన విరమించారు. అధికారులు స్పందించకుంటే కార్యాలయం దగ్గర వంట వార్పు చేసుకుని అక్కడే నిద్రిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.నాగేంద్ర కుమార్, జిల్లా కమిటీ సభ్యులు తరిమెల నాగరాజు, ప్రకాష్, చెన్నారెడ్డి, నాగమ్మ, లక్ష్మీదేవి తదితర నాయకులు పాల్గొన్నారు.

దేవాదాయ శాఖ కార్యాలయంలో బైటాయించిన నాయకులు, బాధిత మహిళలు

రాజకీయ కక్షతోనే ఇళ్ల తొలగింపు

సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజాశక్తి-గార్లదిన్నె

రాజకీయ కక్షతోనే మండలంలోని కల్లూరులో పేదలు నిర్మించుకున్న గుడిసెలను తొలగించారని సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ విమర్శించారు. శనివారం గార్లదిన్నె మండలం కల్లూరు గ్రామంలో గుడిసెలు తొలగింపుతో నిరాశ్రయులై రోడ్డున పడ్డ బాధిత కుటుంబాలను టిడిపి జిల్లా అధ్యక్షుడు కాలవ శ్రీనివాసులుతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం పేదలకు ఇల్లు కట్టిస్తామని హామీ ఇచ్చి కట్టుకున్న ఇళ్లను కూల్చేసోందని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వానికి కోర్టులంటే లెక్కలేకపోవడంతోపాటు చట్టాలపై గౌరవం లేకుండా పోయిందన్నారు. 137 నిరుపేద కుటుంబాలను రోడ్డుకు లాగి ఏం సాధించారని ఎద్దేవా చేశారు. నిత్యావసర వస్తువులు, చిన్న చిన్న ప్లాస్టిక్ సామాన్లను నాశనం చేసి అధికారులు, పోలీసులు పైశాచిక ఆనందం పొందారన్నారు రాష్ట్రంలో విధ్వంసక పాలన సాగుతోందని దుయ్యబట్టారు. ఏ పూటకు ఆ పూటకు తెచ్చుకుని జీవనం సాగిస్తున్న నిరుపేదలను దిక్కు లేనివారిగా చేసిన వైసీపీ ప్రభుత్వానికి పేదల గోడు కుట్టుకుంటుందన్నారు. మూడు రోజులుగా ఇదే గ్రామంలో గడప గడపకూ తిరుగుతున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి కనీసం ఇటువైపు చూసిన పాపానపోలేందన్నారు. 90 ఎకరాలను కొట్టేసిన వారిని వదిలిపెట్టి పేదలు వేసుకున్న గుడిసెలను తొలగించడం ఎంత వరకూ సమంజసమని ప్రశ్నించారు. ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి పేదలకు తిరిగి పునరావసం కల్పించాలన్నారు. అలాగే నష్టపోయిన ప్రతి కుటుంబానికీ రూ.లక్ష ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం అధ్యక్షుడు నాగరాజు, మండల కార్యదర్శి చెన్నారెడ్డి, టిడిపి నాయకులు కేశవరెడ్డి, ఆలం నర్సానాయుడు, గేటు కృష్ణారెడ్డి, ఇల్లూరు రామాంజనేయులు, వడ్ల రాము, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇళ్లు కూల్చివేతను పరిశీలిస్తున్న నాయకులు

అధ్యాపకులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న జెఎన్‌టియు విసి రంగజనార్ధన

పరిశ్రమలు, కళాశాలల మధ్య

అవగాహన పెంచుకోవాలి

జెఎన్‌టియు ఉపకులపతి రంగజనార్ధన

ప్రజాశక్తి-అనంతపురం

పరిశ్రమలు, కళాశాలల మధ్య పరస్పర అవగాహన పెంచుకోవాలని జెఎన్‌టియు ఉపకులపతి రంగజనార్ధన సూచించారు. స్థానిక జెఎన్‌టియు ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ సెమినార్ హాలులో సైన్స్, హ్యూమానిటీస్ విభాగం ఆధ్వర్యంలో జాతీయ విద్యావిధానం-2020 మనుగడ అంశంపై ఆరు రోజులపాటుగా నిర్వహించిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఎస్‌వి సత్యనారాయణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అధ్యాపకులు నైపుణ్యాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రస్తుత సమాజంలో చదువుతోపాటు నైపుణ్యాలకు ఎంతో ముఖ్య పాత్ర ఉందన్నారు. జాతీయ విద్యావిధానం-2020పై అధ్యాపకులు మరింత అవగాహన పెంపొందించుకుని, విద్యార్థులకు నూతన విషయాలను తెలియజేయాలని సూచించారు. అధ్యాపకులు లేటెస్ట్ టెక్నాలజీస్‌పై నైపుణ్య శిక్షణ ఇస్తే మరింత ముందుకెళ్లే అవకాశం ఉందన్నారు. అలాగే పరిశ్రమలు, కళాశాలల మధ్య పరస్పర అవగాహన పెంచుకోవాలన్నారు. ఇరాబోవు కాలంలో ఆర్టిఫిసియల్ ఇంటలిజెన్స టూల్స్‌ను మరింత ఉపయోగించుకునే అవకాశాలు ఉన్నాయన్నారు. ఆచార్య సి.శశిధర్ మాట్లాడుతూ ఇలాంటి సదస్సుల వల్ల నూతన అవిష్కరణలపై బోధనా సిబ్బందికి మంచి అవగాహన ఏర్పడుతుందన్నారు. నూతన సాంకేతిక పరిజ్ఞానం విద్యార్థులకు అందించడానికి ఉపాధ్యాయులు తమకున్న పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమానికి కో ఆర్డినేటర్‌గా వి.బి.చిత్ర, కో కోఆర్డినేటర్‌గా జి.మమత వ్యవహరించారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులకు విసి సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఇ.అరుణకాంతి, ఎం.రామశేఖర్‌రెడ్డి, వివిధ కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇండస్ట్రియల్ కన్సల్టెన్సీ సర్వీస్ డైరెక్టర్‌గా విశాలి బాధ్యతలు స్వీకరణ

స్థానిక జెఎన్‌టియు ఇండస్ట్రియల్ కన్సల్టెన్సీ సర్వీసెస్ డైరెక్టర్‌గా ఎన్.విశాలి శనివారం బాధ్యతలు చేపట్టారు ఈ సందర్భంగా ఆమె తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించిన విసి జి.రంగజనార్ధన, రెక్టార్ ఎం.విజయకుమార్, రిజిస్ట్రార్ సి.శశిధర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా తనవంతు కృషి చేస్తానన్నారు. అనంతరం విసితోపాటు రిజిస్ట్రార్ విశాలికి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం డైరెక్టర్లు పి.సుజాత, ఆర్.కిరణ్మయి, బి.ఈశ్వర్‌రెడ్డి, బి.దుర్గాప్రసాద్, పద్మ సువర్ణ, సి.శోభాబిందు, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.వి.సత్యనారాయణ, ఆచార్య ప్రశాంతి, మాజీ ఆచార్యులు వి.శంకర్, రామశేఖరరెడ్డి, జె.శ్రీనివాసులు, కళ్యాణి రాధ, ఓంప్రకాష్, ఎం.అంకారావు, డిప్యూటీ రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి, తదితరులు అభినందనలు తెలిపారు.

గుత్తి ఆర్‌ఎస్‌లో ట్రాఫిక్ సమస్య..!

రహదారిపై అడ్డదిడ్డంగా వాహనాలు

స్తంభిస్తున్న రాకపోకలు - ఇబ్బందులు పడుతున్న ప్రజలు

ప్రజాశక్తి-గుత్తి

మున్సిపాలిటీ పరిధిలోని గుత్తి ఆర్‌ఎస్‌లో కర్నూలు రోడ్డుపై పార్కింగ్ చేస్తున్న వాహనాలతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్న రహదారిపై అడ్డదిడ్డంగా వాహనాలు ఉంచడంతో రోడ్డుపై సంచరించే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దుకాణదారులు దాదాపు 5 అడుగుల వరకూ రోడ్డును ఆక్రమించి దుకాణాలు నిర్మించుకున్నారు. దీంతో రహదారి కుదించుకుపోయింది. ఇరుకైన ఈ రహదారిలో ప్రజలు ఎలా వెళ్లాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది. రహదారి గుండా మండలంలోని బేతాపల్లి, ఊటకల్లు, ఎంగన్నపల్లి, చెట్నేపల్లికి ప్రజల వాహనాల్లో వెళుతుంటారు. అలాగే రైల్వేస్టేషన్‌కు వెళ్లేందుకు ప్రయాణికులు వాహనాల్లో ప్రయాణిస్తుంటారు. వివిధ షాపులకు వచ్చే కొనుగోలు దారులు దుకాణాల ముందర స్థలం లేకపోవడంతో నడి రోడ్డుపై తమ వాహనాలను పెట్టడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. తరచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. సమస్యను పోలీసులు పట్టించుకోవడం లేదు. ఆక్రమణలను మున్సిపాలిటీ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

ఇష్టారాజ్యంగా వెళ్తున్న ఆటోలు

ఎక్కడ పడితే అక్కడ నిలిపిన ద్విచక్ర వాహనాలు

పెట్రోల్ బంకుల్లో తనిఖీలు

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని పెట్రోల్ పంపులను లీగల్ మెట్రాలజీ అధికారులు శనివారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఇందులో భాగంగా పెట్రోల్, డీజిల్ డెలివరీలను పరిశీలించారు. అనంతరం వాహనదారులు వాహనాలకు పెట్రోల్, డీజిల్ నింపే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం రేషన్ సరుకులు పంపిణీ చేసే వాహనాలను తనిఖీ చేశారు. ఇందులో బియ్యం పంపిణీలో మోసాలు ఉన్నట్లు గుర్తించి రెండు కేసులు నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ పి.సుధాకర్, ఇన్స్‌పెక్టర్ మహమ్మద్‌గౌస్, సిబ్బంది తెలిపారు.

వేగవంతంగా 'నాసిన్' పనులు

ఆర్థికశాఖమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్

నాసిన్ పనుల పురోగతిపై అధికారులతో చర్చిస్తున్న ఆర్థిక మంత్రి బుగ్గన

ప్రజాశక్తి గోరంట్ల రూరల్

గోరంట్ల మండలం పాలసముద్రం వద్ద ఏర్పాటు చేస్తున్న జాతీయ కస్టమ్స్ పరోక్ష పన్నులు మరియు మాదక ద్రవ్యాల అకాడమీ (నాసిన్) పనులు వేగవంతంగా జరుగుతున్నాయని ఆర్థికశాఖామంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన రాష్ట్ర ప్రత్యేక ఆర్థిక శాఖ కార్యదర్శి షంషేర్ సింగ్ రావత్, జిల్లా జాయింట్ కలెక్టర్ టిఎస్ చేతన్, పెనుగొండ సబ్ కలెక్టర్ కార్తిక్ తదితరులతో కలిసి నాసిన్ కేంద్రాన్ని శనివారం ఉదయం సందర్శించారు. ఈ సందర్భంగా నాసిన్ లో నూతనంగా ఏర్పాటు చేయనున్న (ఐఆర్‌ఎస్) ఇండియన్ రెవెన్యూ సర్వీస్ శిక్షణ కేంద్రానికి సంబంధించిన అంశాలపై వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. తొలుత నాసిన్ అకాడమిలో జరుగుతున్న పురోగతి గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఐఆర్‌ఎస్ శిక్షణ కేంద్రం ఏర్పాటుకు సంబంధించిన పనులకు సంబంధించి ఇప్పటివరకు జరిగిన పనుల అభివృద్ధిపై ఆయా శాఖల ద్వారా ఆరా తీశారు. గొల్లపల్లి రిజర్వాయర్ నుండి నాసిన్ వరకు 34.15 కిలోమీటర్ల మేరకు నీటి సరఫరా పైపు లైన్ల పనులు ఏదశకు చేరుకున్నాయని ఎపిఐఐసి జోనల్ మేనేజర్ సోనీ ద్వారా అడిగి తెలుసుకున్నారు. అలాగే పాలసముద్రం చెరువు అభివృద్ధికి సంబంధించి రూ. 4. 32 కోట్ల అంచాన వ్యయంతో నివేదికలను ఇదివరకే ప్రభుత్వానికి సమర్పించిన నేపథ్యంలో పాలసముద్రం చెరువుల తూముల మరమ్మతులు, కట్టల పటిష్టత చర్యలు, నీటి సరఫరా కాలువల మరమ్మతులు, చెరువు సామర్థ్యం పెంచడానికి అవసరమైన చర్యలు , జంగిల్ క్లియరెన్స్ తదితర అంశాలపై మైనర్ ఇరిగేషన్ గంగాధర్, లక్ష్మి నారాయణతో చర్చించారు. అకాడమీలో గ్రీనరీకి సంబంధించిన పనులకు సహకరించాలని అలాగే అవసరమైన మొక్కలను అందజేయాలని అటవీ శాఖ అధికారి శ్యామలకు మంత్రి సూచించారు. ఏపీ ఎస్పీడీసీఎల్ ద్వారా ఇప్పుడు వరకు జరిగిన ఎలక్ట్రికల్ లైన్స్ పనులు, నేషనల్ హైవే , రైల్వే లైన్ల ఏర్పాటు తదితర అంశాలపై ఆయా శాఖ అధికారులతో సమీక్షించారు. అలాగే గత సమీక్ష సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలపై ఇప్పటివరకు జరిగిన భవన నిర్మాణ వివరాలు అభివృద్ధి పురోగతి పెండింగ్ పనులపై మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ చర్చించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాల పరస్పర సహకారాలతో నాసిన్ మరింతగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. నాసిన్ కేంద్రంలో త్వరలోనే ప్రారంభం కానున్న ఇండియన్ రెవెన్యూ సర్వీసెస్ శిక్షణ కేంద్రంలో అన్ని వసతుల ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఐఎఎస్, ఐపిఎస్ శిక్షణ కేంద్రాల ఏర్పాటు లాగానే మన రాష్ట్రానికి ఐఆర్‌ఎస్ మంజూరు కావడం శుభ పరిణామమని అన్నారు. ఐఆర్‌ఎస్ శిక్షణ కేంద్రంలో కేవలం దేశానికే కాకుండా దక్షిణ ఆసియా ప్రాంతంలోని వివిధ దేశాల నుంచి కూడా అధికారులు ఈ కేంద్రంలో శిక్షణ పొందే అవకాశం ఉందని ఇది రాష్ట్ర గౌరవానికి ఎంతో దోహదపడుతుందని మంత్రి అన్నారు. నాసిన్ లో పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగుల కుటుంబాల పిల్లలకు మెరుగైన విద్యను అందించి ప్రోత్సహించే దిశగా త్వరలోనే కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు కానున్నట్లు చెప్పారు. స్థానికుల కుటుంబాల పిల్లలకు కూడా కేంద్రీయ విద్యాలయంలో వీలైనంతగా ప్రవేశ అవకాశం కల్పిస్తున్నట్లు మంత్రి వివరించారు. అంతకుముందు నాసిన్ పరిశీలించడానికి విచ్చేసిన మంత్రికి జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, జాయింట్ కలెక్టర్ టీఎస్ చేతన్, సబ్ కలెక్టర్ కార్తిక్, కేంద్ర రెవెన్యూ సెక్రెటరీ సంజయ్ మల్హోత్రా, సిబిఐసి చైర్మన్ సంజయ్ అగర్వాల్, మెంబర్ అలోక్ శుక్లా,డైరెక్టర్ జనరల్ నాసిన్ ఆర్ కె రాఘవన్, ప్రిన్సిపల్ అడిషనల్ డైరెక్టర్ జనరల్, ప్రాజెక్ట్ ఇన్‌ఛార్జి నారాయణస్వామి తదితరులు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ హుస్సేన్ పీరా, డిఇఒ మీనాక్షి, సిపిఒ విజయకుమార్, రైల్వే శాఖ నాగభూషణం, ఏపీఎస్పీడీసీఎల్ షణ్ముఖం, నేషనల్ హైవే శ్రావణ్ కుమార్, నాసిన్ మేనేజర్ శ్రీకాంత్, గోరంట్ల తహశీల్దార్ రంగనాయకులు, సోమందేపల్లి తహశీల్దార్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాల నిర్మూలనకు చర్యలు

వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఎం.గౌతమి

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ఎం.గౌతమి, అధికారులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టర్

జిల్లాలోని బాల్య వివాహాల నిర్మూలనకు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ గౌతమి తెలిపారు. శనివారం విజయవాడలోని సిఎస్ క్యాంపు కార్యాలయం నుంచి స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు, ఆరోగ్యం, స్త్రీ, శిశుసంక్షేమం- ప్రభుత్వ పథకాలు, ఎస్డీజీ సూచికలు, పాఠశాల విద్య, జగనన్నకు చెబుదాం తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్.జవహర్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో బాల్యవివాహాలను అరికట్టేందుకు నిరంతరం చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందులో భాగంగా పాఠశాలల్లో రోజూ బాల్య వివాహాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై వివరిస్తున్నామన్నారు. అలాగే ఆలయాలు, మందిరాలు, చర్చిల్లో పూజారులు, ఖాజీలు, ఫాస్టర్లకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. అంతేగాకుండా జిల్లా, డివిజన్, మండల స్థాయిలో నిరంతరం అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. ఎక్కడైనా బాల్య వివాహం జరుగుతోందని తెలిసినా, ఫిర్యాదు వచ్చినా ఊరు వదిలి పోకుండా, పెళ్లి చేసుకోకుండా బైండోవర్ చేయించేలా ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. బాల్యవివాహం జరిగిపోయింది అని తెలిస్తే చట్ట ప్రకారం కేసు నమోదు చేస్తున్నామన్నారు. జిల్లాలో బాల్య వివాహాలను అరికట్టేందుకు తీసుకుంటున్న చర్యల వల్ల కేసులు తగ్గుముఖం పట్టాయన్నారు. అలాగే జిల్లాలో 100 శాతం స్థూల నమోదు నిష్పత్తి (గ్రాస్ ఎన్రోల్మెంట్ రేషియో, జిఈఆర్) నమోదుకు చర్యలు చేపడుతున్నామని, బాలికల డ్రాపౌట్లని తగ్గించి వారిని మళ్లీ పాఠశాలల్లో చేర్పించేలా దృష్టి పెట్టామన్నారు. 5 నుంచి 18 ఏళ్ల వయస్సు ఉన్న ప్రతి ఒక్క చిన్నారినీ పాఠశాలలో చేర్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఒ అశోక్‌కుమార్‌రెడ్డి, ఐసిడిఎస్ పీడీ శ్రీదేవి, డిఎంహెచ్ఒ డాక్టర్ ఇబి.దేవి, ఎస్-ఎస్ఎ ఏపిసి వరప్రసాద్, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, డిఇఒ నాగరాజ్, డిఎల్‌డిఒ ఓబుళమ్మ, డిఐఒ యుగంధర్, ఇంటర్ బోర్డు ఆర్‌ఐఒ వెంకటరమణనాయక్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ ఇహషాన్‌బాషా, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, స్పందన తహశీల్దార్ వాణిశ్రీ, కంబదూరు ఎంఇఒ మదన్‌మోహన్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలి

విద్యార్థి, యువజన సంఘాల జేఏసీ నేతలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రయివేటీకరణ ఉప సంహరించాలని, కడప ఉక్కు పరిశ్రమ ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ విద్యా, యువజన సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 8న చేపట్టనున్న విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని విద్యార్థి, యువజన సంఘాల జేఏసీ నేతలు పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని కెఎస్‌ఆర్ జూనియర్ కళాశాల ఆవరణలో ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం వివిధ విద్యాసంస్థల్లో తిరిగి విద్యార్థులకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతురు పరమేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రమణయ్య, కుళ్లాయిస్వామి, బిసి, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి బిసి.సురేష్, ఐసా జిల్లా కార్యదర్శి ఆలం, ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్ష కార్యదర్శులు శివ, భీమేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వంశీ, హరికృష్ణ, ఏఐవైఎఫ్ నాయకులు నిఖిల్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : విశాఖ ఉక్కు పరిరక్షణ, కడప ఉక్కు ఫ్యాక్టరీ సాధన కోసం ఈనెల 8న చేపట్టనున్న విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని పిడిఎస్‌యు, ఎఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఎఐవైఎఫ్ సంస్థల ప్రతినిధులు పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్ట్ర విభజన సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణను ఆపడంతోపాటు ప్రోత్సాహానికి చర్యలు తీసుకోవాలని, కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తద్వారా యువతకు ఉద్యోగ, ఉపాధి లభిస్తుందన్నారు. కేంద్రంలో పోరాడి ఆయా సమస్యలను పరిష్కరించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షణతోపాటు కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రానున్న రోజుల్లో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షుడు మల్లెల ప్రసాద్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నాగార్జున, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆంజనేయులు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బంగి శివ, ఎఐవైఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు కుమార్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

బెలుగుప్ప : కడప ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటుతోపాటు విశాఖ ఉక్కు పరిరక్షణకు విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో నవంబర్ 8న రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్న విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు చందు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనేక త్యాగాలతో విద్యార్థి, యువజన నాయకులు 32 మంది ప్రాణత్యాగాలతో ఏర్పాటైన విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని మోడీ ప్రభుత్వం ప్రయివేటీకరణ చేసేందుకు పూనుకుందన్నారు. అలాగే కడపలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

గార్లదిన్నె : కడపలో ఉక్కు పరిశ్రమను ప్రారంభించాలని, విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రయివేటీకరణ ఆపాలని నవంబర్ 8న విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి తరిమెల గిరి, ఉపాధ్యక్షుడు సిద్ధార్థ్ పిలుపునిచ్చారు. ఈమేరకు శనివారం మండల కేంద్రంలో ఇందుకు సంబంధించిన గోడపత్రికలను ఎస్ఎఫ్ఐ నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని గొప్పలు చెప్పి అధికారంలోకి వచ్చిన కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం ఎక్కడా ఉద్యోగాలు కల్పించిన పాపాన పోలేదన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ చేస్తానని అనేక హామీలు ఇచ్చి ఒక్క ఉద్యోగం ఇచ్చిన పాపానపోలేదన్నారు. కొత్త ఉద్యోగాలు ఇవ్వకపోగా రాష్ట్రంలో లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తూ ఉపాధి కల్పిస్తున్న విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రయివేటీకరణ చేయాలని చూడడం దారుణమన్నారు. కావున విశాఖ ఉక్కును పరిరక్షించడంతోపాటు కడపలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యల పరిష్కారానికి నవంబర్ 8న రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గార్లదిన్నె ఎస్ఎఫ్ఐ నాయకులు శరత్, సుమంత్, వివేకానంద, వెంకట్రాం, గోవింద్, యశ్వంత్, పవన్, హిరణ్య, సతీష్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లను విడుదల చేస్తున్న విద్యార్థి, యువజన సంఘాల జేఏసీ నాయకులు

నాసా కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-అనంతపురం

నాసాకిట్లను పంపిణీ చేస్తున్న శ్రీచైతన్య పాఠశాల ఏజిఎం సుబ్బారెడ్డి

నగరంలోని ఆదిమూర్తినగర్‌లో ఉన్న శ్రీచైతన్య పాఠశాల 9వ బ్రాంచిలో అమెరికాలోని స్పేస్ సెటిల్మెంట్ కాంటెస్టులో పాల్గొనే విద్యార్థులకు శనివారం నాసాకిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీచైతన్య విద్యాసంస్థల అనంతపురం జోన్ ఏజిఎం సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలోనే దేశానికి చెందిన శాస్త్రవేత్తలకు ప్రత్యేక ఉన్నత స్థానం ఉందన్నారు. అలాంటి శాస్త్రవేత్తలు అందించిన స్ఫూర్తితో విద్యార్థులు తమ నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ శాంత, అకడమిక్ జిల్లా కోఆర్డినేటర్ తిరుమలేసు, అకాడమిక్ డీన్ గంగాధర్ నాసా ఇన్‌ఛార్జి హరినాథ్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టపాసుల కేంద్రాలకు అనుమతులు రద్దు చేయాలి

ఉరవకొండ : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఎస్.కె గవర్నమెంట్ హైస్కూల్ మధ్య ఉన్న మైదానంలో టపాస్ కేంద్రాలకు అనుమతులు రద్దు చేయాలని జివిఎస్ఎస్ రాష్ట్ర కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ ఇరుకుల ప్రజా సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి సాకే పురుషోత్తం డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ వెంకటస్వామికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యం విద్యార్థులు, ప్రజలతో కిటికిటలాడుతున్న ప్రాంగణంలో టపాసులు కేంద్రాలు ఏర్పాటు చేస్తే ఇబ్బందులకు గురవుతారన్నారు. కావున వెంటనే అనుమతులను రద్దు చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యుడు చిరంజీవి, ఆర్ఎస్‌యు జిల్లా అధ్యక్షులు రాగులపాడు భీమేష్, తదితరులు పాల్గొన్నారు.

గొల్లపల్లిలో 'గడప గడపకూ మన ప్రభుత్వం'

రాయదుర్గం : గుమ్మగట్ట మండలం గొల్లపల్లి గ్రామంలో శనివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విప్ కాపు రామచంద్రారెడ్డి హాజరై ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రభుత్వ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గుమ్మగట్ట మండల వైసిపి కన్వీనర్ గౌని లక్ష్మీకాంత రెడ్డి, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పెన్నోబులేసుడి పల్లకీ సేవ

ఉరవకొండ : మండలంలోని పెన్నోబిలంలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆలయ ఈవో విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా పల్లకిసేవ నిర్వహించారు. ముందుగా స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలతో అలంకరించి పల్లకీలో మేళతాళాల మధ్య ఆలయం చుట్టూ ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, అర్చకులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

హెల్త్‌క్యాంపు పరిశీలన

అనంతపురం కార్పొరేషన్ : నగరంలోని 37వ సచివాలయం పరిధిలో ఏర్పాటు చేసిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' హెల్త్‌క్యాంపును మేయర్ మహమ్మద్ వసీం డిప్యూటీ మేయర్ వాసంతితో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గతంలో దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ తెచ్చారని, ఆయన స్ఫూర్తితో నేడు సిఎం జగన్ ముందుకు సాగుతున్నారన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా పెద్ద ఎత్తున ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందనన్నారు.అందులో భాగంగానే జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్ ద్వారా ప్రజల గుమ్మం ముందుకే వైద్యాన్ని తీసుకొచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సైఫుల్లా, బాలాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఓటరు జాబితా సవరణ

కళ్యాణదుర్గం : నియోజకవర్గంలోని బూత్‌స్థాయి అధికారులు పకడ్బందీగా ఓటరు జాబితా సవరణ చేపట్టాలని ఆర్‌డిఓ రాణిసుస్మిత సూచించారు. శనివారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఎన్నికల తహశీల్దార్లు, బీఎల్‌ఓలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఓ మాట్లాడుతూ బీఎల్‌ఓలు ఆదివారం కూడా సాయంత్రం 5గంటల వరకూ పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉండాలన్నారు. ఎవరైనా ఓటరు మరణించినా, శాశ్వతంగా ఊరు వదిలి వెళ్లినా ఓట్లు తొలగించాలన్నారు. అలాగే 18 సంవత్సరాలు నిండిన వారికి ఓటరుగా నమోదు చేయాలన్నారు. డోరునెంబరు, వయస్సు మొదలగు వాటిని ఎప్పటికప్పుడు సరిచేయాల్సి ఉంటుందన్నారు. అంతకు ముందు మండల పరిధిలోని గోళ్ల పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు.

ఆలయాలకు టిటిడి నిధులు మంజూరు

ఉరవకొండ : నియోజకవర్గంలోని వజ్రకరూరు, విడపనకల్ మండలాల్లోని ఎస్సీ, ఎస్టీ, బిసి కాలనీల్లో నిర్వహించనున్న మూడు ఆలయాలకు దేవాదాయ ధర్మాదాయ శాఖ, తిరుమల తిరుపతి దేవాస్థానాలు నిధులు మంజూరు చేసినట్లు ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక్కో ఆలయానికి రూ.10లక్షల చొప్పున రూ.30 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. విడపనకల్లు మండలంలోని డోనేకల్ బోగలింగేశ్వర స్వామి, వజ్రకరూరు మండలం వెంకటాంపల్లి పెద్దతండాలో ఆంజనేయస్వామి, జె.కొట్టాలలో మారెమ్మ ఆలయాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

నార్పల : మండల కేంద్రంలోని సరస్వతీ విద్యామందిరం పాఠశాలలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు కరస్పాండెంట్ మోరుసు సంజీవరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో జిల్లాలో పేరుపొందిన 15 ఆసుపత్రుల్లో పని చేసిన ప్రముఖ డాక్టర్లు హాజరై పరీక్షించనున్నట్లు తెలిపారు. కావున ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సిఐటియు జిల్లా ఆఫీస్ బేరర్‌గా ఎటిఎం నాగరాజు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

సిఐటియు జిల్లా ఆఫీస్ బేరర్‌గా ఎటిఎం నాగరాజు ఎన్నికయ్యారు. శనివారం జిల్లాకేంద్రంలోని సిఐటియు కార్యాలయంలో జిల్లా అధ్యక్షురాలు నాగమణి అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎటిఎం నాగరాజుకు మున్సిపల్ యూనియన్, సిఐటియు సంఘంలో జిల్లా ఆఫీస్ బేరర్‌గా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర, ఆఫీస్ బేరర్లు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలి : జనసేన

ఉరవకొండ : పట్టణంలోని ఈశ్వరీమాత ఆలయం ముందున్న డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలని జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి గౌతమ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం ఉరవకొండ పంచాయితీ కార్యదర్శి గౌస్‌సాహెబ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరానగర్ కాలనీ నుంచి మురుగునీరు ఈశ్వరీ మాత ఆలయం ముందు ప్రవహించడంతో భక్తులతోపాటు ఆలయం చుట్టుపక్కల ఉన్న వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. డ్రెయినేజీ కాలువలు ఏర్పాటు చేయకపోవడంతో వెంటనే డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు రాజేష్, నాయకులు దేవేంద్ర, భోగేష్, మణికుమార్, తదితరులు పాల్గొన్నారు.

'క్యాట్' ఫలితాల్లో 'శ్రీచైతన్య' విజయదుందుభి

క్యాట్ రెండో దశకు ఎంపికైన విద్యార్థులతో శ్రీచైతన్య పాఠశాల సిబ్బంది

అనంతపురం : క్యాట్ 2023-24 ఒలింపియాడ్ మొదటి లెవెల్ ఫలితాల్లో అనంతపురం జోన్ శ్రీచైతన్య పాఠశాలలకు చెందిన 1501 మంది విద్యార్థులు రెండవ లెవెల్‌కు అర్హత సాధించినట్లు విద్యాసంస్థల ఏజిఎం సుబ్బారెడ్డి తెలిపారు. శనివారం నగరంలోని కమ్మభవన్ సమీపంలోని శ్రీచైతన్య పాఠశాలలో విద్యార్థులకు అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే అత్యంత ప్రాచుర్యం పొందిన ఒలింపియాడ్ పరీక్షల్లో క్యాట్ ఒలింపియాడ్ ఒకటి అన్నారు. అంతటి అత్యున్నతమైన ఒలింపియాడ్ పరీక్షల్లో అనంతపురం జోన్‌కి చెందిన శ్రీచైతన్య విద్యార్థులు మాథ్స్‌లో 539, ఫిజిక్స్‌లో 415, కెమిస్ట్రీలో 547 మంది విద్యార్థులు రెండవ లెవెల్‌కు ఎంపికకావడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపళ్లు విశ్వనాథ్, తబుస్సుం, సమీనాఖాన్, నేత్రావతి, వీరేష్‌బాబు, రాజేష్‌బాబు, నారాయణస్వామి, శ్రీనివాస్, బాబు, కోఆర్డినేటర్లు రాధాకృష్ణ, తిరుమలేష్, శ్రీనివాస్, నాగభూషణం, డీన్లు, ఇన్‌ఛార్జులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కల్చర్ మీడియా కిట్లు వితరణ

అనంతపురం : స్థానిక సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలోని సూక్ష్మజీవ శాస్త్ర విభాగానికి రూ.30 వేలు విలువజేసే కల్చర్ మీడియా కిట్లు, నిర్ధారణ పరీక్షల్లో వాడే యాంటీబయోటిక్లను కదిరిలోని లైఫ్ లైన్ లాబరేటరీస్ నిర్వాహకులు ఆరీఫ్ అందజేశారు. దీంతో దాత అరీఫను డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ కెఎల్ సుబ్రమణ్యం అభినందించారు. ఈ సందర్భంగా శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంఒ డాక్టర్ సుభాష్ చంద్రబోస్, ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ సౌజన్యకుమార్, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి మైక్రోబయాలజిస్ట్ డాక్టర్ ఆదిరెడ్డి పరదేశీనాయుడు, మైక్రో బయాలజీ ప్రధాన విభాగాధిపతి డాక్టర్ శాంతిరెడ్డి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శైలజ, సీనియర్ రెసిడెంట్ డాక్టర్ లలిత భవాని, మైక్రోబయాలజీ టెక్నీషియన్ భార్గవ్, సూపర్ స్పెషాలిటీ డాక్టర్లు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

ఉరవకొండ : కలెక్టర్ ఆదేశాల మేరకు ఉరవకొండలోని 128, 129, 130, 131, 132 ప్రత్యేక ఓటర్ నమోదు కేంద్రాలను తహశీల్దార్ శ్రీధర్‌మూర్తి శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఎల్‌ఒలకు కేటాయించిన పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ అందుబాటులో ఉండి ఓటరు నమోదు దరఖాస్తులను స్వీకరించాలని సూచించారు. ఇప్పటి వరకూ ఓటరు నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ మునీంద్ర, ఆర్ఐ రామకృష్ణ, సీనియర్ అసిస్టెంట్ వంశీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

దంతాల పరిరక్షణ అవసరం : డాక్టర్ దిలీప్

అనంతపురం కలెక్టరేట్ : విద్యార్థులు తమ దంతాలను పరిశుభ్రంగా ఉంచుకుని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతో ఉందని ప్రముఖ దంత వైద్య నిపుణులు డాక్టర్ దిలీప్ సూచించారు. శనివారం ప్రజారోగ్య వేదిక, విద్వాన్ విశ్వం విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో 1వ రోడ్డు శారదా హైస్కూల్‌లో ఉచిత డెంటల్ క్యాంప్ నిర్వహించారు. ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ వీరభద్రయ్య డెంటల్ క్యాంప్‌ను ప్రారంభించగా, కార్యదర్శి శ్రీనివాసరావు అధ్యక్షతన వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ దిలీప్ హాజరై పిల్లలకు దంత సమస్యలపై అవగాహన కల్పించడంతోపాటు పిల్లలకు ఓరల్ హైజీన్‌పై వివరించారు. ఈ కార్యక్రమంలో విద్వాన్ విశ్వం విజ్ఞాన కేంద్రం కన్వీనర్ ఏజి.రాజమోహన్, శారదా హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, ప్రజా పరిరక్షణ కన్వీనర్ రామసుబ్బారెడ్డి, కమిటీ సభ్యులు సుబ్రమణ్యం, ఎంఎన్‌టి.రాజు తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్ మరమ్మతుల పరిశీలన

గుత్తి : శ్రీ సత్యసాయి తాగునీటి ప్రాజెక్టుకు సంబంధించిన పైపులైన్ మరమతులను కౌన్సిలర్లు, వైసీపీ నాయకులు శనివారం పరిశీలించారు. గుత్తి మున్సిపాలిటీలో కొన్ని నెలలుగా తాగునీటి సమస్య తీవ్రంగా నెలకొంది. దీంతో వైసిపి సీనియర్ నాయకులు బి. శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్లు పామిడి వద్ద ఉన్న శ్రీ సత్యసాయి తాగునీటి ప్రాజెక్టు సంబంధించిన పంప్‌హౌస్‌ను పరిశీలించారు. తర్వాత గుత్తిలో పైప్‌లైన్ లీకేజీలను పరిశీలించారు. పైప్‌లైన్ల మరమ్మతులను త్వరతగతిన పూర్తి చేసి తాగునీటిని సరఫరా చేసేందుకు చర్యలు చేపడతామని వైసీపీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు వి.వరదరాజులు, వాల్మీకి శివరాం, అరవింద్ బాబు, సచివాలయాల కన్వీనర్ ఎం.రంగస్వామి, వైసిపి ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

డివైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం

తాడిపత్రి : భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) 43వ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ జెండాను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతకు ఉపాధి, ఉద్యోగ రక్షణ, మెరుగైన విద్య కోసం పోరాడుతున్న ఏకైక సంస్థ డివైఎఫ్ఐ అన్నారు. భగత్‌సింగ్, అల్లూరి వంటి నేతల స్ఫూర్తితో డివైఎఫ్ఐ ఏర్పడిందన్నారు. మా దేహం ముక్కలైనా దేశాన్ని ముక్కలు కానివ్వమన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం దేశంలో యువతకు ఉద్యోగాల నోటిఫికేషన్లు విడుదల చేయాలన్నారు. అలాగే రాష్ట్రంలోని జగన్ ప్రభుత్వం కూడా యువత పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. లక్షలాది మంది ఉపాధి లేక అల్లాడుతున్నారన్నారు. వెంటనే రాష్ట్రంలో ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నగర నాయకులు శివ, బాబా, రాజు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి సైక్లింగ్ ఎంపిక పోటీలు

ఉరవకొండ : వజ్రకరూరు మండలంలోని కొనకొండ్ల స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన అండర్-14 జిల్లాస్థాయి సైక్లింగ్ సెలక్షన్ పోటీలను వైసిపి యువనేత, జిల్లా ఖో-ఖో కమిటీ అధ్యక్షుడు వై.భీమ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల మానసిక, శారీరక ఎదుగుదలకు తోడ్పడటమే కాకుండా సృజనాత్మక శక్తిని పెంపొందిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వేణుగోపాల్, ఫిజికల్ డైరెక్టర్ సత్యనారాయణ, కళా సుధాకర్, సత్యసాయి జిల్లా కోఆర్డినేటర్ మురార్జీ, తదితరులు పాల్గొన్నారు.

'దుర్గం'లో దోచేయ్..బళ్లారిలో దాచేయ్..

విప్ 'కాపు'పై మాజీమంత్రి 'కాలవ'

ప్రజాశక్తి-రాయదుర్గం

'రాయదుర్గంలో దోచెయ్-బళ్లారిలో దాచేయ్' అనే నినాదంలో విప్ కాపు రామచంద్రారెడ్డి పాలన సాగిస్తున్నారని మాజీమంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు ఆరోపించారు. బాబు షూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా శనివారం రాయదుర్గం 9వ వార్డులో ఏర్పాటు చేసిన ప్రజావేదికలో ఆయన మాట్లాడుతూ కర్ణాటక మద్యం రాయదుర్గం ప్రాంతంలో ఏరులై పారుతోందన్నారు. పేదల ఆరోగ్యాలతో విప్ కాపు చెలగాటమాడుతున్నాడని విమర్శించారు. వేదవతి, హగరి నది నుంచి రోజూ పదుల సంఖ్యలో టిప్పర్లలో ఇసుకను కర్ణాటకకు తరలిస్తున్నారన్నారు. అవినీతికి చిరునామాగా మారిన విప్ రామచంద్రారెడ్డిని చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. అనంతరం టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పసుపులేటి నాగరాజు, 9వ వార్డు మాజీ కౌన్సిలర్ పురుషోత్తం, మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ జ్యోతి, మాజీ మున్సిపల్ వైస్‌ఛైర్మన్లు వెంకటేశులు, మహబూబ్ బాషా, సంపత్‌కుమారి, ఇనాయత్‌బాషా, తిప్పేస్వామి, ధనార్జున, సురేంద్ర, యల్లప్ప, రాజశేఖర్, శ్రీరాములు, రవి, మల్లి, అశోక్, జావిద్, తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు

రూ.800కోట్లతో 'అనంత' అభివృద్ధి : ఎమ్మెల్యే అనంత

ప్రజాశక్తి-అనంతపురం

వైసిపి అధికారంలోకి వచ్చాక అనంతపురంలో రూ.800 కోట్లతో అభివృద్ధి పనులు చేసినట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. శనివారం నగరంలోని 21వ డివిజన్‌లో రూ.24 లక్షలతో రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్ నాయకత్వంలో చరిత్రలో ఎన్నడూ చూడని విధంగా అనంతపురంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ కార్పొరేషన్ పాలకవర్గం అభివృద్ధిని పరుగులు పెట్టిసోందన్నారు. ముఖ్యంగా ప్రధాన రహదారులు, బ్రిడ్జిలు, రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం చేపట్టినట్లు వివరించారు. గత టిడిపి ఐదేళ్ల పాలన కేవలం మాటల గారడీగా మారితే.. వైసీపీ హయాంలో అనంతపురం రూపురేఖలు మారుస్తున్నామన్నారు. మున్సిపల్ జనరల్ ఫండ్స్, 14, 15 ఫైనాన్స్ ఇతర నిధులు సుమారు రూ.100 కోట్లు వెచ్చించి డివిజన్లలో అభివృద్ధి చేశామన్నారు. 2019 ఎన్నికల సమయంలో తాము ప్రచారానికి వెళ్తే ఎక్కడ చూసినా గుంతలే దర్శనమిచ్చేవన్నారు. నేడు అలాంటి పరిస్థితి లేదన్నారు. అనంతపురం రూపురేఖలు మారుస్తున్నామన్నారు. అనంతపురం నియోజకవర్గంలో అభివృద్ధి జరగలేదని ప్రతిపక్షాలు కూడా చెప్పలేని పరిస్థితి ఉందన్నారు. ప్రత్యేకంగా సీఎం జగన్ అనంతపురానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 12 నుంచి 14 నియోజకవర్గాలకు స్పెషల్ ఫండ్స్ వస్తే.. అందులో అనంతపురానికి రూ.25 కోట్లు ఇచ్చారని గుర్తు చేశారు. గత పాలకులు అంబేడ్కర్ నగర్‌ను తీవ్ర నిర్లక్ష్యం చేశారన్నారు. కానీ తాము అధికారంలోకి వచ్చాక అభివృద్ధి అంటే ఇదీ అనేలా ఒక్క డివిజన్‌లోనే రూ.1.75 కోట్లతో పనులు చేశామని వివరించారు. ఈ కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కొగటం విజయభాస్కర్‌రెడ్డి, మార్కెట్ యార్డు ఛైర్మన్ ఫయాజ్, వక్ఫ్‌బోర్డు సభ్యుడు ఖమర్తాజ్, కార్పొరేటర్లు సాకే చంద్రలేఖ, లీలావతి, లావణ్య, సైఫుల్లాబేగ్, బాబా ఫకృద్దీన్, ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు సాకే కుళ్లాయిస్వామి, వైసీపీ నాయకులు చంద్రశేఖర్ (చిన్నా), శోభన్, సురేష్, లక్ష్మి, జాఫర్, అజీమ్‌బాషా, ఇలియాజ్, జిలాన్, హిద్దు, వేణు, ముత్యాలప్ప, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

సిఐ నరేంద్రరెడ్డిని సస్పెండ్ చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి-గుత్తి

గార్లదిన్నె మండలం కల్లూరులో పేదల గుడిసెలు తొలగించి సిపిఎం నాయకులుపై దాడి చేసి కులం పేరుతో దూషించిన సీఐ నరేందర్‌రెడ్డిని తక్షణమే సస్పెండ్ చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు వి.నిర్మల డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని జెడ్ వీరారెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ గార్లదిన్నె మండలం కల్లూరు గ్రామంలో దళితులు, గిరిజనులు, పేదలు నాలుగేళ్ల క్రితం గుడిసెలు వేసుకుని చేతివృత్తి పనులు చేసుకుంటూ జీవనం కొనసాగించేవారన్నారు. అయితే ఈనెల 1న పెద్ద ఎత్తున పోలీసులు బలగాలతో వెళ్లి పేదల గుడిసెలు తొలగించారన్నారు. సమాచారం తెలుసుకున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వి.రాంభూపాల్‌తోపాటు పలువురు నాయకులు అక్కడికి చేరుకుని విచారిస్తుండగా అక్కడ పోలీసులు చేరుకుని సిపిఎం నాయకులను అడ్డుకున్నారన్నారు. ఎందుకు పేదల గుడిసెలు తొలగిస్తున్నారని ప్రశ్నిస్తుండగా అక్కడ ఉన్న ఇటుకలపల్లి సీఐ నరేందర్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేస్తూ దాడి చేసి కులం పేరుతో దూషించారన్నారు. ప్రస్తుతం గుడిసెలు వేసుకున్న స్థలం హై కోర్టులో పెండింగ్‌లో ఉందని చెప్పినా వినకుండా కోర్టును ధిక్కరించి సిపిఎం జిల్లా నాయకులపై సీఐ దాడి చేశారన్నారు. వెంటనే సిఐని సస్పెండ్ చేయాలని, లేనిపక్షంలో దశలవారీగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకురాలు రేణుకమ్మ, కెవిపిఎస్ మండల కార్యదర్శి యు.మల్లికార్జున, ఐద్వా నాయకురాలు కవిత పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

పేదల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

గార్లదిన్నె : పేదలకు సంక్షేమ పథకాలు అందించి వారి జీవితాల్లో వెలుగు నింపడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి తెలిపారు. శనివారం మండలంలోని కల్లూరు గ్రామ పంచాయతీ-1 పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివరెడ్డితో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఎం జగన్ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లలా భావించి పాలన సాగిస్తున్నారన్నారు. వివిధ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్న ప్రజల్లో సంతోషం కనిపిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి వెంకటనారాయణ, కన్వీనర్ నరేందర్‌రెడ్డి, మాజీ ఎంపిపి ప్రదీప్‌రెడ్డి, తహశీల్దార్ ఉషారాణి, తదితరులు పాల్గొన్నారు.

మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పద్మావతి

అభివృద్ధే అజెండా అయ్యేనా?

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

దేశంలోనే అత్యంత వెనుకబడింది అనంతపురం జిల్లా. ప్రభుత్వాలు మారుతున్నా ఈ జిల్లావాసుల తలరాతలు మారడం లేదు. రైతు ఆత్మహత్యల పరంపర సాగుతూనే ఉన్నాయి. ఉపాధి కోసం వలసలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ ఏడాదీ జిల్లాలో తీవ్రమైన దుర్భిక్ష పరిస్థితులే నెలకొన్నాయి. అయితే కరువు మండలాల ప్రకటనలోనూ అన్యాయమే జరిగింది. అనంతపురం జిల్లాలో మూడు మండలాల్లో కరువు ప్రకటన లేదు. సత్యసాయి జిల్లాలో 11 మండలాలు కరువు మండలాలు ప్రకటించలేదు. అన్ని చోట్ల ఒకే పరిస్థితులున్నప్పటికీ ఈ మండలాలను కరువు మండలాలు ప్రకటించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అన్ని మండలాలను కరవు మండలాలుగా ప్రకటించాలని విపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ప్రకృతి వైపరిత్యాలు ఈ రకంగా రైతులను దెబ్బతీస్తుంటే...పాలకులు నిర్లక్ష్యం మరింత ఇబ్బందులకు గురిచేస్తోంది. ఈ ప్రాంతాభివృద్ధిపై దృష్టి సారించడం లేదు. ఈ అంశాన్ని సిపిఎం చేపట్టిన ప్రజారక్షణ భేరీలో ప్రజలకు వివరించే ప్రయత్నం చేసింది. మూడు రోజులపాటు ఉమ్మ డి అనంతపురం జిల్లాలో ఈ యాత్ర సాగింది. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్ నేతృత్వంలో సాగిన ఈ యాత్రలో జిల్లా అభివృద్ధి, పాలకుల నిర్లక్ష్యంపై గురించి ప్రజలకు వివరించారు. సమగ్రాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదే విధంగా అంతక మునుపు సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలోనూ సమగ్రాభివృద్ధిపై మేధావులు, సామాజికవేత్తలు తదితరులతో చర్చావేదిక సైతం నిర్వహించడం జరిగింది. ఇందులో వచ్చిన అంశాలతో సమగ్రాభివృద్ధి ప్రణాళికను రూపొందించి ప్రభుత్వం ముందుంచే యోచనలోనుంది. ఎన్నికల సమయంలో దీనిపై ప్రచారోద్యమాన్ని సైతం చేపట్టాలని భావిస్తోంది. ఎందుకంటే ప్రధాన రాజకీయ పార్టీలైన వైసిపి, టిడిపి అభివృద్ధిపై కాకుండా వ్యక్తిగత అంశాలపై ఎక్కువగా దృష్టి మళ్లిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజా సమస్యలను రాజకీయ అజెండాలోకి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తుంది. ఇదే సమయంలో ఈ వారంలో పెనుకొండ, కల్లూరుల్లో పేదలు వేసుకున్న గుడిసెలను అధికారులు బలవంతంగా తొలగించడం చర్చనీయాంశమూ అయింది. ప్రధానంగా కల్లూరులో నాలుగేళ్లుగా నిరుపేదలు నివసిస్తుంటే వారి ఇళ్లను తెల్లవారుజామునే వెళ్లి కూల్చివేయడం పట్ల విపక్షాలు మండిపడుతున్నాయి. దేవాదాయ శాఖ అధికారులు 90 ఎకరాలు పెద్దలు ఆక్రమించుకుని అమ్మేసుకున్నా పట్టించుకోకుండా నిరుపేదలున్న ఇళ్లను మాత్రమే కూల్చివేయడాన్ని తప్పుబడుతున్నారు. దీనిపై వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం సైతం ఏర్పాటు చేశారు. ప్రభుత్వం స్పందించి పేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే రాబోయే రోజుల్లో దీనిపై ఉద్యమిస్తామని హెచ్చరిస్తున్నారు. పేదల పక్షమని చెప్పే ప్రభుత్వం పేదల గుడిసెలను ఈ రకంగా కూల్చేస్తుండటం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కల్లూరులో నివాసం ఏర్పాటు చేసుకున్న 132 కుటుంబాలు కూడా గిరిజన సంచరా జాతులే అధికంగానున్నాయి. సర్కార్ ఆట ఆడించేవారు, పశు పోషణ చేసుకునే వృత్తిలోనున్న వారే అధికంగా ఉన్నారు. వీరందరూ స్థిర నివాసం ఏర్పాటు చేసుకుని తమ పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పే ఆలోచనలోనున్నారు. ఇటువంటి నిరుపేదల పట్ల ప్రభుత్వం అనుసరించిన తీరును ప్రతి ఒక్కరు తప్పుబడుతున్నారు. ముఖ్యమంత్రి చెప్పే క్లాస్ స్ట్రగుల్ మాట అర్థమిదేనా అని ప్రశ్నిస్తున్నారు.